# మరుగుజ్జు

-ఎమ్.సి.శివశంకర శాస్త్రి

భర్త ఇంటికి రాగానే జరిగిన విషయం ఆయన ముందుభళ్ళున కక్కేయాలని ఆతృతగా ఎదురు చూస్తోంది రమ్య.

ఈలోగా తన విధిని గుర్తుచేస్తూ టంగ్...టంగ్.. మంటూ ఐదు గంటలు కొట్టింది పాతకాలపు గోడ గడియారం.

అనంతరం ఓ అరగంటయ్యాక ఇంటి ముందు స్కూటరాగిన శబ్దం.

గబగబా వెళ్ళి తలుపు తీసింది.

అర్జెంట్ ఫైల్సేవో కొన్ని చేత పట్టుకుని గడపదాటి అలా ఇంట్లోకి అడుగేస్తూండగానే తలుపు బార్లావేస్తూ

"ఇన్నేళ్ళుగా మా నాన్న అలాంటి వాడు, ఇలాంటి వాడని దబాయించి పడేశారే ఇక తమరిప్పుడేం చెబుతారో చెప్పండి చూద్దాం... ఘనమైన మీ తండ్రిగారి గొప్పలు గురించి" ముక్కుపుటాలెగరేస్తూ ఆవేశపూరితంగా అంది రమ్య.

"ఆఫీసులో అర నిమిషం కూడా హాయిగా కూర్చోనీల్లేకుండా బోల్డు ప్రాబ్లమ్స్‌తో సతమతమై తీరా ఇంటికొస్తే ప్రశాంతంగా నాలుగు మాటలు మాట్లాడ్డం మానేసి వీరావేశంతో చిందులేస్తావేంటే? ఇంతకీ ఏం జరిగిందో చెప్పుమరి??" విసుగ్గా అన్నాడు శ్రీకాంత్.

"ఛీ! ఛీ!! దరిద్రపు గొట్టు సంబంధం. మీ కుటుంబ సాంప్రదాయాలు ఇలాంటివని తెలీక నన్ను మీకంటగట్టేశారు. అయినా ఇప్పుడదంతా తోడుకుంటే ఏంలాభం? అంతా నా ఖర్మనుకోవాలి...ఖర్మ...!!" రుసరుసలాడుతూ చేత్తో టపటపా నుదురు బాదుకుంది రమ్య.

'ఏం మనిషివే నువ్వు? జరిగిందేదో తిన్నగా చెప్పి చావకుండా నోటికి పచ్చినట్టల్లా వాగుతున్నావేంటీ?' శ్రీకాంత్ వాయిస్ కొద్ది హెచ్చు స్థాయిలో వినిపించింది.

"మీ నాన్నగార్ని వయసుకు తగినట్టు పెద్దరికంగా ఉండమని చెప్పండీ... చెప్పండీ... అని గీపెట్టుకున్నా నామాట విన్నారు కాదు. ఇపుడా మహానుభావుడి పుణ్యమా అని మా కుటుంబ గౌరవమంతా మంట కలిసిపోయింది."

"రమ్యా! ఇక నా సహనం పరీక్షించక జరిగిందేదో చెప్పి తగలడు. లేదంటే మర్యాదగా ఉండదు" శ్రీకాంత్ కళ్ళెగ్రబడ్డాయ్.


"మొన్న మీతో ఓ విషయం చెప్పాను గుర్తుందా?"

గుర్తులేదన్నట్టు పెదవి విరిచి తల అడ్డంగా ఆడించాడు.

"అవున్లెండి. మీకలాంటివన్నీ ఎందుకు గుర్తుంటాయ్. అదే మా పుట్టింటి వేపు వారి సంగతులయితే ఎంచక్కా ప్రతీదీ గుర్తుంచుకుని సాధిస్తూంటారు. ఎంతైనా మీ మగజాతి బుద్ధులే అంత" పుల్ల విరుపు మాటలు పల్కింది.

"అబ్బబ్బా! ఆపవే నీ వెధవనస. అప్పట్నుంచీ సాధిస్తున్నావ్ గాని అసలు సంగతేంటో మాత్రం చెప్పి చావటంలేదు" కయ్‌మంది గొంతు.

"ఎందుకైనా మంచిది.. నే చెప్పే విషయం జాగ్రత్తగా గుండెచేత పట్టుకుని వినండి. ఇటీవల మీ నాన్నగారు ఎదురింటి పార్వతమ్మ గారితో గంటల తరబడి కూచుని ముచ్చట్లాడుతుంటే నేచూసి అది



కె.భగవాన్ రెడ్డి, కార్టూనిస్ట్, మార్టేరు - 534 122, పశ్చిమ గోదావరి - జిల్లా.

మంచి పద్ధతి కాదని చెప్పండి అంటే నామాట పూచిక పుల్లలా తీసిపడేశారు."

"అయితే ఇప్పుడేమయిందనీ?" కస్సుమంటూ ఎదురు ప్రశ్న.

"ఏం జరక్కూడదో అదే జరిగింది. తెల్లారి ఐదింటికి మీరింట్లో ఉండగానే నిద్రలేచి పాచి ముఖంతో ఎప్పట్లాగానే వెళ్ళిపోయిన పెద్ద మనిషి ఇంత వరకూ ఇంటికి రానేలేదు. ఆ పోయేదేదో ఒక్కడే పోయి ఉండే ఎంతో బావుండేది" భార్య చెప్పిన మాటల్లో చివరి పదజాలం శ్రీకాంత్‌కి కొంచెం దడ పుట్టించింది.

"అయితే ఆయన కూడా ఇంకెవరెళ్ళారూ?" కొంచెం బెరుగ్గా వచ్చిందీ మాట.

"జతగా ఆయన గారి ప్రేయసి ఎదురింటి పార్వతమ్మను లేవదీసుకుపోయాడు. ఇందాక వాళ్ళబ్బాయి కోడలూ వచ్చి నానా బీభత్సం సృష్టించి 'మీ మామగారికి ఇంత వయసొచ్చి కూడా ఇదేం పోగాలం దాపురించిందండీ. ఆయన మాయలోపడి నిప్పులాంటి మా అమ్మ పాడైపోయింద'ంటూ తెగ తిట్టిపడేసి కంప్లయింట్ ఇవ్వటానికని పోలీస్ స్టేషన్ కెళ్ళారు."

పిడుగు వార్త భళ్ళున కళ్ళెసరికి నిలువెల్లా చెమటలు పోసి కళ్ళు బైర్లుగమ్మి సోఫాలో కూలబడి పోయాడు శ్రీకాంత్.

కళ్ళు తెరిచే సరికి బెడ్ రూమ్‌లో తను మంచం మీదున్నాడు.

"మిస్టర్ శ్రీకాంత్! జరిగిన దాన్ని గురించి ఆలోచిస్తూ ఆరోగ్యం పాడుచేసుకోకండి. టేక్ ఇట్ ఈజీ" జాగ్రత్త చెప్పి వెళ్ళిపోయాడు ఫ్యామిలీ డాక్టర్.

మనసు మరోవేపు మళ్ళిద్దామనుకున్నా తన తండ్రిని గురించిన ఆలోచనే కుమ్మరి పురుగులా తొలిచేస్తోంది.

నీరసంగా కళ్ళు మూసుకు పడుకున్నశ్రీకాంత్‌కి తలవని తలంపుగా గతమోసారి మదిని మెదిలింది.

☆ ☆ ☆

శ్రీకాంత్ మూడవ తరగతి చదువుతున్న రోజులవి. టైఫాయిడ్‌తో అమ్మ చనిపోయింది. ఎలిమెంటరీ స్కూల్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేసే తండ్రి తనని అల్లారు ముద్దుగా చూసుకుని తల్లిలేని లోటు తీర్చి పెంచి పెద్దచేశాడు.




గట్టి పునాదివేసి బాగా చదివించటంతో ప్రతీ తరగతి ర్యాంక్‌తో పాసై చివరికి ఎమ్మెస్సీలో తాను బంగారు పతకం అందుకోవటానికి కారకుడు నాన్నే అయ్యాడు.

అనంతరం హైదరాబాదులోని ఓ పబ్లిక్ రంగ సంస్థలో హోదాగల ఉద్యోగం వచ్చింది. అదే సంవత్సరం నాన్న రిటైర్‌మెంట్, ఆ మరుయేట సంబంధం వెతుక్కుంటూ రావటంతో అమ్మాయి నచ్చిందని రమ్యను పెళ్ళిచేసుకోవటం జరిగి పోయింది.

పదవీ విరమణానంతరం మామూడూరిలో ఉన్న రెండెకరాల పొలం సాగు చేసుకుంటూ కాలక్షేపం

## పరిచయం



పేరు: యం.సి.శివశంకరశాస్త్రి
జన్మస్థలం: అనంతపురం జిల్లాలోని 'మాముడురు' అనే చిన్న పల్లెటూరు.
ప్రస్తుతం: హైదరాబాద్‌లో డిప్యూటీ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను.

చిన్నప్పట్నుంచి బాలసాహిత్యం, వ్యాసరచనా వ్యాసాంగాల్లో ప్రవేశముండటం మూలానా నేను వ్రాసిన పలు అంశాలపై వందకుపైన వ్యాసాలు అన్ని పత్రికల్లో ప్రచురింపబడ్డాయి. అచ్చయిన కథల సంఖ్య ఇరవై ఐదు.
1994లో దీపావళికి 'జాగృతి' పత్రిక నిర్వహించిన కథల పోటీలో 'దృష్టిదోషం' అనే నా కథకు తొలిసారిగా తృతీయ బహుమతి వచ్చింది.

నాకథకు కన్సొలేషన్ బహుమతినిచ్చి ప్రోత్సహించిన 'అమృత్ కిరణ్' ఎడిటర్‌గారికి కృతజ్ఞతలు.

-యం.సి. శివశంకర శాస్త్రి

డ్రై ఇంజనీర్, W - 205, హెచ్.యం.టి (పోస్ట్), హైదరాబాద్ - 500 854.

చేసుకుంటూ ఉన్న నాన్నని తమ దగ్గరే ప్రశాంతంగా ఉండి పొమ్మని తనూ, రమ్యా కలసి పోరుపెట్టి హైదరాబాదు తీసుకురావటం జరిగింది.

ప్రశాంత జీవనానికి అలవాటు పడిన నాన్నకి నగర వాతావరణం పడక మళ్ళీ మాముడూరికి వెళ్ళిపోతానంటే వద్దని వారించి అక్కడే ఉంచుకోవటం జరిగింది.

ఆయనకి పొద్దుపోక ఇంటి ముందున్న పెద్ద బాదం చెట్టు కింద కూచుని ఇరుగు పొరుగు జనంతో కాలక్షేపం చేయటం రమ్యకే మాత్రం సరిపడలేదు.

"మామగారూ! ఆ అలగా జనంతో కూచుని అలా బాతాఖానీ కొడుతూ ఉంటే మా పరువేం కావాలనుకున్నారు. ఛీ! ఛీ!! ఈ ముసలాళ్ళకు తెలీదు, చెబితే వినిచావరు. ఇక మీదట ఆ పోరంబోకు జనంతో మాట్లాడితే మర్యాదగా ఉండదు... జాగ్రత్త!!" తన ఎదురుగుండానే ఒకటి రెండుసార్లు రమ్య కటువుగానే వినిపించింది.

"మనిషి సంఘజీవి తల్లీ! అందరితోనూ కలిసి మెలిసి ఉండాలికాని ఏకాకిగా ఉండటానికి ప్రయత్నించకూడదమ్మా!"

రమ్య ఈసడించినపుడు ఆయన సౌమ్యంగా చెప్పిన మాటలు కూడా రింగ్ మన్నాయి.

మరెందుకో గాని రానురానూ రమ్య మాటలు పనసతొనలలై తానుకూడా తండ్రిని చులకనగా చూస్తూ ప్రతిదానికీ విసుక్కోవడం, ఏకవచన ప్రయోగ పదజాలంతో హెచ్చరించడం జరిగింది.

ఒకదాని వెంట మరొకటిగా గతం మెదుల్తూంటే "ప్చ్!" అంటూ అప్రయత్నంగా తల అడ్డంగా ఆడించాడు శ్రీకాంత్.

"ఏంటండీ! చిన్న పిల్లాడిలా మీరు మరీ ఇదైపోతున్నారు. ఇందాక డాక్టరు గారేం చెప్పెళ్ళారు? ఇక ఆ దరిద్రుణ్ణి గురించి ఆలోచించటం మానేయండి. ఈ రోజుతో శని విరగడైపోయిందనుకుందాం"

వేళ్ళు ఫళఫళా విరుస్తూ మామగారిని తెగ తిట్టిపోసింది రమ్య.

ఉత్తమ ఉపాధ్యాయుడుగా రాష్ట్రస్థాయి అవార్డుకూడా అందుకుని ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దిన తన తండ్రి రమణమూర్తికి ఎందుకిలాంటి నీచమైన బుద్ధి పుట్టిందో శ్రీకాంత్‌కి బోధ పడటంలేదు.


"అరవై రెండేళ్ళ వయసులో కట్టలు తెంచుకొస్తున్న కామవాంఛ తీర్చుకునేందుకు ఆ ఘనుడికి ఓ ఆడది కావాల్సొచ్చిందా? ఛీ!ఛీ!! సంస్కారహీనుడు. వృద్ధజంబుకం. అలాంటి వాణ్ణి అనుకోవటం కూడా పాపమే" తిట్టుకుంటూ బాధగా అలా పక్కకి తిరిగి పడుకుని బిర్రుగా కళ్ళు మూసుకున్నాడు. బాగా పొద్దు పోయాక నిద్రలోకి జారుకున్నాడు.

☆ ☆ ☆

లీవ్ అప్లయి చేసి నాల్గు రోజుల పాటు తనకి అనుమానం ఉన్న చోటల్లా తండ్రికోసం వెతికాడు గాని ఫలితం లేకపోయింది.

చివరికి ఇంటికి తిరిగొచ్చి తానెక్కడెక్కడ వెదికిందీ భార్యతో వివరిస్తూండగా "పోస్ట్" అన్న పిలుపు బయటి నుంచి వినిపించగానే గబగబా బైటికొచ్చి పోస్ట్‌మెన్ అందించిన కవర్ తీసికొని భర్తకిచ్చింది రమ్య.

దాని మీదున్న దస్తూరి చూడగానే తన తండ్రి




కె.భగవాన్ రెడ్డి, కార్టూనిస్ట్, మార్టేరు - 534 122, పశ్చిమగోదావరి - జిల్లా.

## హెచ్చరించిన లతామంగేష్కర్

ఇతరులు పాడిన ఆడియో కేసెట్లపై తన ఫోటో ప్రచురించి శ్రోతలను తప్పుదోవ పట్టిస్తున్నారని టీ సిరీస్, వీనస్ కంపెనీలకు నోటీసులు పంపించింది లతామంగేష్కర్. అనుపమా దేశ్‌పాండే అనే కొత్త గాయకురాలు పాడిన పాటల కేసెట్లపై 'వీనస్' కంపెనీ వారు లతామంగేష్కర్ బొమ్మ ప్రచురించి నందుకు గానూ, వందనా వాజ్‌పేయి పాడిన కేసెట్లపై 'టి సిరీస్' వారు తన ఫోటోతో అమ్మకాలు పెంచుకోవాలని దురాశ పడినందుకు గానూ నోటీసులు జారీచేసింది లత. 1988లో ఇలాగే జరిగినపుడు 'టి సిరీస్' వారు లతకు క్షమాపణ కోరారు. మళ్ళీ ఇలా... పాట ఒకరిదీ... ఫోటో ఒకరిదీనూ!

-మధుర.

రాసిందేనని తెలిసి పోయింది. విషయం తెలుసు కోవాలనే తహ తహతో వెంటనే కవర్ ఓపెన్‌చేసి కళ్ళకు పనప్పగించాడు.

గతంలో ఉత్తర ప్రత్యుత్తరాలు రాసేప్పుడు ఎంతో ప్రీతి పాత్రంగా సంబోధించే "చి॥శ్రీకాంత్‌కి మంగళాశీస్సులతో" అనే పదజాలాలేవీ ఉపయోగించ కుండా తిన్నగా విషయమే వివరించటం జరిగింది.

ఉత్తర సారాంశం మీదికి చూపు మళ్ళించాడు.

శ్రీకాంత్‌కి ముప్పయ్యేళ్ళ పాటు ఓ తరహా జీవితానికి అలవడిన ఓ వ్యక్తియొక్క నడవడిక క్షణాల్లో మారిపోవాలంటే మారదు. చిన్న తనం నుంచీ నా గురించి క్షుణ్ణంగా తెలిసిన నువ్వు నన్నునుమానిస్తూ వచ్చినందుకు నవ్వాలో, ఏడ్వాలో కూడా తేల్చుకోలేక పోయాను.

ఎదురింటి పార్వతమ్మగారు నాకు పరిచయ మయ్యాక ఒకరి కష్టసుఖాలొకరు చెప్పు కుంటూ అభిమానాలు పెంచుకున్నాం.

నేనూ, పార్వతమ్మగారు కలిసి వరండాలో కూచుని మాట్లాడుకుంటూంటే చాటుగా నీభార్య తొంగిచూసి మెల్లిగా నీ చెవికెక్కిస్తూంటే అవి వేదోక్తాలుగా తీసికొని నన్ను నిందించినపుడల్లా చిన్నవాడివి తెలీక అంటు న్నావు లెమ్మనుకుని సర్దుకు పోయాను.

కానీ మొన్న పదిహేను రోజుల క్రితం మీరిద్దరూ కలిసి అన్న మాటలు నాగుండెను గాయపరచి నిలువునా కృంగదీశాయి.

ఇక ఎదురింటనేమో కాటికి కాళ్ళు చాపుతూన్న పార్వతమ్మగారితో కొడుకూ, కోడలూ కలిసికట్టుగా వెట్టిచాకిరీ చేయించుకుంటూ సూటీ పోటీ మాటలతో బాధించారంటే ఆ పాపం ఎప్పటికైనా పండకమానదు. భగవంతుడు వాళ్ళని క్షమించడు గాక క్షమించడు.

ఈ సమాజం మమ్మనుమానించి నిందలంటగట్టి బురద చల్లినంత మాత్రాన మేమేం భయపడం.

ఇదే సమాజం ఓ ఆడదానికి విధించిన కట్టుబాట్లను అనుసరించాల్సిన వయస్సు దాటి పోయిన అరవై ఎనిమిది సంవత్సరాల పార్వతమ్మగారు కాని, నేను గానీ ఈ సమాజానికి భయపడాల్సిన పనిలేదు.

మేమిద్దరం కలిసి కట్టుగా బయలు దేరినప్పుడే ఊపిరి ఉన్నన్నాళ్ళూ అక్కా తమ్ముళ్ళమై సొంతకూడు తిని బతకాలన్న తలంపుతోనే గడపదాటాం.

ఇక్కడో ప్రయివేటు గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులుగా చేరాం. ఈ పసిపాపలను కేవలం తల్లిదండ్రులే కాకుండా దేశమే గర్వించేలా తీర్చిదిద్దాలన్నదే మా ఆశయం! ఈ ఉత్తరాన్ని పార్వతమ్మ గారింట కూడా చూపించేది.

ఆ భగవంతుడు మలినపడిన మీ మనస్సులను కడిగేసి ముమ్ముందు మంచి మనసులను ప్రసాదించాలనీ... సదా మీ అభ్యున్నతే కోరుతూ సెలవు తీసు కొంటున్నాను.


ఇట్లు

రమణమూర్తి

ముక్తా ఫలాలకు ప్రతి రూపంగా పేర్చినట్లున్న రమణమూర్తి అనే ఆ చేవ్రాలు ఆయన నిష్కల్మష హృదయానికి ప్రతీక... అనిపించేలా ఉంది.

ఆకాశమంత మహోన్నత భావాలు కల్గిన తన తండ్రి ముందు... తానో మరుగుజ్జు నన్న భావం శ్రీకాంత్ మనస్సులో శాశ్వతంగా నిలచిపోయింది.

-ఎం.సి.శివశంకర శాస్త్రి
డిప్యూటీ ఇంజినీర్,
డబ్ల్యూ-205, హెచ్ఎమ్‌టి (పోస్ట్)
హైదరాబాద్ - 500 854.




పూడిమూడి విలియం, అయిభీమవరం, ఆకివీడు - మండలం, పశ్చిమ గోదావరి - జిల్లా-534 235.